క్లుప్తంగా

అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

రఘునాథపాలెం: మండలంలోని మల్లేపల్లిలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 7వ తేదీన ఉదయం 11 గంటల 11 నిమిషాలకు ముత్యాలమ్మ, బొడ్రాయి నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవం వేలాది భక్తజనం సమక్షంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బండి వెంకన్న తెలిపారు. మొదటి రెండు రోజులు ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించి ఊరేగింపు చేయబడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి మంగళవారం దాతలు విరాళం అందించారు. 1వ డివిజన్ కైకొండాయగూడెం చెందిన నంబూరి భాస్కర్‌రావు–సమత దంపతులు రూ.25,116లను విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ తెలిపారు.

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన పర్సా సావిత్రిదేవి, చిల్లా సత్యవతి, చిట్టిపు చెన్నారెడ్డి, కొత్త సుశీల, అద్దంకి వెంకన్న, అంగడి కుందమ్మ, పగిళ్లపల్లి రాములు, వోలం సాంబయ్య మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదారాబాద్ ఎల్.వీ. ప్రసాద్, అగర్వాల్, వాసన్ ఐబ్యాంక్‌లకు పంపించినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్. అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐబీ సీఈ బదిలీ సరికాదు

ఖమ్మంఅర్బన్: గత ఐదేళ్లుగా ప్రభుత్వ భూములు, జల వనరుల శాఖ భూములను ఆక్రమించుకున్న వారికి ఎన్‌ఓసీ ఇవ్వనందుకే ఐబీ చీఫ్ ఇంజనీర్ శంకర్‌నాయక్‌ను బదిలీ చేశారని, ఆయన తల్లి మరణించిన రోజునే బదిలీ చేయడం శోచనీయమని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఈపై సీఎం కేసీఆర్‌కు తప్పుడు ఆరోపణలతో కూడిన నివేదిక ఇవ్వడం వల్లే బదిలీ చేశారని తెలిపారు. ఇలాంటి చర్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి గ్రామంలో మంగళవారం ఆళ్ల చిట్టెమ్మ మృతిచెందగా.. సర్పంచ్ మెంటం రామారావు, మాజీ జెడ్పీటీసీ కుర్రా భాస్కర్‌రావు, మంత్రి వ్యక్తి గత పీఏ రవికిరణ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పువ్వాడ ఫౌండేషన్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు సంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాతా వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామారావు, బుచ్చిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

నేలకొండపల్లి: మేతకు వెళ్లిన మేక విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా ఉన్న తీగను తాకడంతో షాక్ గురై మృతి చెందింది. మండలంలోని చెరువుమాధారానికి చెందిన రైతు చల్లా వీరబాబు తన మేకల మందను మంగళవారం మేతకు తీసుకెళ్లగా.. ఈ ప్రమాదం జరిగింది. అయితే, మేక కింద పడిపోగానే ఆందోళనతో వీరబాబు ముందుకు వెళ్తుండడంతో స్థానిక రైతులు కేకలు వేయగా ఆయన ఆగిపోయాడు. లేదంటే ప్రమాదం జరిగేదని చెబుతున్నారు. కాగా, రైతుకు న్యాయం చేయాలని సర్పంచ్ ఈవూరి సుజాత, సొసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి తదితరులు డిమాండ్ చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జైలర్
సాయిరాం	బెదురులంక 2012
ఆదిత్య	ఓఎంజీ–2 (హిందీ)
శ్రీనివాస	భోళా శంకర్

– ఖమ్మంగాంధీచౌక్

గురువే మార్గదర్శి...

మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక పలువురు వక్తలు మాట్లాడారు. గురువులు విద్యార్థుల నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి విజయానికి సరైన మార్గాన్ని చూపిస్తారని, అలాంటి గురువులను జీవితాంతం గుర్తుపెట్టుకొని గౌరవించడం అందరి కర్తవ్యమని, గురువే మార్గదర్శి అని తెలిపారు. అనంతరం గురువులను సత్కరించారు. అలాగే ఉపాధ్యాయులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ నేపథ్యాన గురుపూజోత్సవ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంక్రైం: శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్కూల్ చైర్‌పర్సన్ హృదయమీనన్



ఖమ్మంఅర్బన్: బల్లేపల్లిలోని బ్లూమింగ్‌మైండ్స్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల వేషధారణలో చిన్నారులు



చైతన్య ఒలంపియాడ్ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



తిరుమలాయపాలెం: జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జ్యోతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



విన్‌ఫీల్డ్ పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థిని



శ్రీనివాసనగర్ రెజొనెన్స్ స్కూల్‌లో విద్యార్థులతో డైరెక్టర్ నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు



రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్‌లో డైరెక్టర్ శ్రీధర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డీఈఓను సత్కరించిన బ్రహ్మకుమారిలు..



డీఈఓకు మెమెంటో ఇస్తున్న బ్రహ్మకుమారిలు

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మను బ్రహ్మకుమారిలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి రాజయోగిని అరుణ, గీతా, రమాదేవి, నాగేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల సన్మానం..



నాటి గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎన్నెస్పీ కాలనీ హై స్కూల్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు(1984–1985 బ్యాచ్) తమకు విద్యాబుద్ధులు నేర్పిన 40 ఏళ్ల క్రితం నాటి గురువులను మంగళవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారి నివాసాలకు వెళ్లి సత్కరించారు. నాటి ఉపాధ్యాయులు బుడిగం సత్యం(90), రామయ్య(89), కె.విజయభాస్కర్‌రావు (74)లను నూతన వస్త్రాలను అందించి, శాలువ, పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జూపల్లి శివరామయ్య, నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ లెక్చరర్ సీహెచ్.శ్రీనివాస్, ఆర్ అండ్‌బీ సూపరింటెండెంట్ పెద్దబోయిన నాగరాజు, నూకం శ్రీనివాస్, బషీర్, గదరి బాబు, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ దంపతులకు..



గోపాలరావు దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న పాఠశాల హెచ్‌ఎం లేడిపోయిన గోపాలరావు దంపతులకు గ్రామ పంచాయతీ సర్పంచ్ యాసా నీలిమ, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, మజ్హర్, విజయలక్ష్మి అనంత్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం స్పోర్ట్స్: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన టీచర్లకు సన్మానం



ఖమ్మంరూరల్: క్రీడాపోటీల్లో పాల్గొన్న స్ప్రింగ్‌లీఫ్ ఉపాధ్యాయులు

'గృహలక్ష్మి' నిబంధనలను మార్చండి..



సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: గృహలక్ష్మి విషయంలో ప్రభుత్వ నిబంధనలు పొంతన లేకుండా ఉన్నాయని, రేషన్ కార్డులు ఇవ్వకుండా రేషన్ కార్డు నిబంధన విధించడం ఏంటని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో శింగు నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ పేరుతో దశాబ్ద కాలంగా పేదలకు ఇళ్ల కేటాయింపు జరగలేదని, ఇప్పుడు గృహలక్ష్మి పేరుతో సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణానికి అవకాశం కల్పించినప్పటికీ నిబంధనలు చూస్తే చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా పథకానికి సంబంధించి మరో అవకాశం కల్పించి రేషన్ కార్డు నిబంధనను సడలించాలని డిమాండ్ చేశారు. సీపీఐ శతజయంతోత్సవాల సందర్భంగా ఢిల్లీలో లక్ష మంది రెడ్ షర్ట్ వలంటీర్లతో కవాతు నిర్వహించనున్నామని అందులో భాగంగా శిక్షకులకు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు ప్రసాద్ తెలిపారు. 22 రాష్ట్రాల నుంచి 200 మంది ఖమ్మంలోని శిక్షణకు రానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ఏసు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియనాయక్

కామేపల్లి(కారేపల్లి): ప్రజా సంక్షేమ పథకాలే.. బీఆర్‌ఎస్‌ను మరోమారు గెలిపిస్తాయని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రిక్కితండా గ్రామ పంచాయతీ రాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుంచి 25 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఆమె మాట్లాడారు.ప్రతి పల్లెలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని, తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారిలో ఉబ్బని రాములు, ఇజ్రాయిల్, రాయికంటి రాఘవులు, కోట పెద్ద రాజు, చిట్టిబాబు, బాబురావు, సత్యనారాయణ, కోట మోహన్‌రావు, చేకుట్ల సతీష్, నాగేల్లి భారతమ్మ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, నాయకులు అంతోటి అచ్చయ్య, ఎంపీపీ బానోత్ సునీత, మల్లెంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పోస్టులను భర్తీ చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రగతి శీల మహిళ సంఘం, ప్రగతి యువజన సంఘం డిమాండ్ చేశారు. తొలుత ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకుని రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్యులను కలిసి వినతి పత్రం అందించారు. అంతేకాక స్థానిక ఎంపీడీఓను కలిసి వివిధ సమస్యలపై మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కార్యదర్శి రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఝాన్సీలు మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రికి నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇఫ్టూ ఏరియా కార్యదర్శి పగిడికత్తుల సుదర్శన్, షకీలా, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

11న గణేష్ మండప నిర్వాహకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్

ఖమ్మంగాంధీచౌక్: రానున్న వినాయక చవితి సందర్భంగా గణేష్ మండప నిర్వాహకుల సమావేశాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి తెలిపారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని స్తంభాద్రి ఉత్సవ సమితి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని వర్తక సంఘం భవనంలో సాయంత్రం 4గంటలకు మొదలయ్యే సమావేశానికి మండపాల నిర్వాహకులు హాజరుకావాలని కోరారు. నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్‌రెడ్డి మాట్లాడగా కన్వీనర్ ప్రసన్నకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటాల విద్యాసాగర్‌తో పాటు మూలగుండ్ల శ్రీహరి, అల్లిక అంజయ్య, డొలె సాయికిరణ్, పాలడుగు పాపారావు, ఈశ్వరప్రగడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌సీసీ'కి నిధుల మంజూరుపై హర్షం



పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: నగరంలోని మున్నేరు వరదకు శాశ్వత పరిష్కారం కోసం ఇరువైపుల ఆర్‌సీసీ వాల్ నిర్మాణం చేపట్టేందుకు రూ.690 కోట్లు మంజూరు చేయడం పట్ల మున్నేరు పరివాహక ప్రాంత వాసులు, బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డిల చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. అలాగే రూ.180 కోట్లతో మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి మంజూరు చేయడం ఖమ్మంకే అభివృద్ధి ఐకాన్‌గా నిలువనుందని తెలుపుతూ మంత్రి పువ్వాడకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, కార్పొరేటర్ మాటేటి అరుణ, పసుమర్తి రాంమోహన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వేణు, మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, పాలడుగు పాపారావు, నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, రుద్రాగాని ఉపేందర్, తోట వీరభద్రం, మట్టా వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌నాయక్, గూడా సంజీవరెడ్డి మాటేటి కిరణ్, జాని తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించకపోతే గద్దె దింపడం ఖాయం

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలు వచ్చినప్పుడు ఎన్నికల స్టంట్లు వేయకుండా పెరుగుతున్న ధరలు తగ్గించకపోతే ప్రజలే కేసీఆర్, మోదీలను గద్దె దింపడం ఖాయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన బైపాస్ రోడ్ కూరగాయల మార్కెట్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేసినశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అయన మాట్లాడుతూ ధరలు భారీగా పెంచి ఎన్నికల సమయంలో గోరంత తగ్గించి ప్రజల్ని మోసం చేయాలని చూస్తున్నారని, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతి రోజూ మాటలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలపై నగరంలో ఈ నెల 8న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నర్రా రమేష్, భుక్యా ఉపేంద్ర, ఈఏ భద్రం, ఒ.హుస్సేన్, ఏటా రాజేష్, ఫకీరు, సాహెబ్, మల్లికార్జున్ రెడ్డి, ఒ.బిబీ, గుమ్మడి భిక్షం, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

బలవంతపు సర్వేను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ఖమ్మంమయూరిసెంటర్: అమరావతి–నాగపూర్ హైవే నిర్మాణంలో రైతులకు సంబంధించిన భూముల బలవంతపు సర్వేను నిలిపి వేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిహారం విషయంలో తీవ్ర వివక్ష చూపుతున్నారని, కనీసం రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్బంధించి సర్వే నిర్వహించడాన్ని ప్రశ్నించినందుకురైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతులు కూచిపూడి రవి, వేముల సతీష్, పెంట్యాల వెంకటేశ్వర్లు, అనుబోతు వెంకటేశ్వర్లు, ఆవుల సైదులు, వాల మధుసూదన్ రెడ్డి, జలగం రాజారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో మేరా మిట్టి...మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం పవిత్ర స్థలాల నుంచి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల నాయకుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు అయి రాజకీయాలకు అతీతంగా పవిత్ర అమృత్ ఘాట్ నిర్మాణంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొగటి నాగచారి, సూరగాని పెద్ద వెంకయ్య, కొత్తపల్లి వెంకటేష్, కందరబోయిన గోపి, జడ కోటేశ్వరరావు, సూరగాని తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును..

ఖమ్మం మామిళ్లగూడెం: ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్టు భవన్‌లో ఈనెల 10న జరిగే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కోరారు. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో దీనికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీఎం కేసీఆర్ హామీ మేరకు సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పుల్లయ్య, కంకణాల శ్రీనివాస్, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా ఆధ్వర్యాన మహాసేన ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 9వ తేదీన తలపెట్టిన విజయోత్సవ ర్యాలీ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని ఖానాపురంలో గల జిల్లా మహాసేన కార్యాలయంలో ఖమ్మం జిల్లా మహాసేన అధ్యక్షుడు మంద సంజీవరావు ఆధ్వర్యాన ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. మహాసేన ఏర్పాటు నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 9న నగరంలోని మయూరిసెంటర్ నుంచి రఘునాథపాలెం మండలం మంచుకొండ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పసలపూడి రమేష్, అధ్యక్షులు బండారి ప్రభాకర్, మారపాక పృథ్వీ, అంగడాల అనిల్‌కుమార్, వాడకాల ప్రవీణ్, ఎస్ఎస్ఎల్ పెనుగూరు నాగేశ్వరరావులతో పాటు మిట్టగానపుల సుధాకర్, కన్నెపోగు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన..

భారీ వర్షంతో నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. మంగళవారం కుండపోతగా కురిసిన వర్షంతో డ్రెయిన్లు పొంగి రోడ్లపైకి వరద చేరడంతో వాహనదారులు, పాదచారుల ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవడంతో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, కూలీలు, వాహనాలపై వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు.

– ఖమ్మంమయూరిసెంటర్/స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



ఖమ్మం నగరంలోని కిన్నెర సెంటర్‌లో రోడ్డుపైకి చేరిన వరద నీరు



బుర్హాన్‌పురంలో ఓ వీధిలో రోడ్డుపైకి చేరిన నీరు



వర్షంలో పనులకు వెళ్లి వస్తున్న కూలీలు